క్లుప్తంగా

త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి

మండపేట: మండపేట-ద్వారపూడి రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిపై ఆర్ అండ్ బీ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. ఈ రోడ్డుపై వంతెనల నిర్మాణాపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నేత నాగిరెడ్డి రాంబాబు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

రాధాకృష్ణకు డాక్టరేట్


డాక్టరేట్ పొందిన రాధాకృష్ణ

కె.గంగవరం: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రాధాకృష్ణ సింగింగ్ విభాగంలో డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఇటీవల తమిళనాడులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ, కల్చర్ అకాడమీ సభ్యుల చేతుల మీదుగా రాధాకృష్ణ అవార్డును అందుకున్నారు. గత 30 ఏళ్లగా పాటలు పాడుతూ, సేవా కార్యక్రమాలు చేస్తూ, బౌద్ధ వివాహలు జరిపించడం వల్ల అవార్డు లభించిందని రాధాకృష్ణ తెలిపారు. రాధాకృష్ణ డాక్టరేట్ పొందడంపై గ్రామ పెద్దలు, హాస్టల్ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పోషకాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

కె.గంగవరం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటేనే మెరుగైన ఆర్యోగం ఉంటుందని దంగేరు సెక్టార్ సూపర్ వైజర్ అనురాధ అన్నారు. మండలంలోని కోటిపల్లిలో శనివారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు ఉచితంగా పోషకారం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి వద్ద కూడా ప్రభుత్వం అందిస్తున్న పోషకార పదార్థాలను తింటూ ఆరోగ్యకరంగా ఉండాలని సూచించారు. అనంతరం పోషకాహార ఎగ్జిబిషన్ పెట్టి పోషక విలువలు ఉండే పదార్థాలపై అవగాహన కల్పించారు. యంఎల్‌హెచ్‌పీ దేవిక, ఏఎన్ఎం నాగదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా 'తమలంపూడి'

రాయవరం: వైఎస్సార్ సీపీ రాయవరం మండలశాఖ అధ్యక్షునిగా తమలంపూడి గంగాధరరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా గంగాధరరెడ్డి మాట్లాడుతూ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వినాయకా.. వీడ్కోలిక


సోమేశ్వరంలో నిమజ్జనానికి ముందు గణనాథుడి ఊరేగింపులో భక్తుల సందడి

రాయవరం: భక్తిశ్రద్ధలతో నవరాత్రుల పూజలందుకున్న గణనాథునికి శనివారం భక్తులు అంగరంగ వైభవంగా వీడ్కోలు పలికారు. మేళతాళాలు, బ్యాండ్ మేళాలు, కోలాటాలతో గణనాథుడ్ని వాహనాలపై ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. నవరాత్రులు బుధవారంతో పూర్తి కాగా, గురువారం నుంచి వాడవాడలా ఏకదంతుని నిమజ్జనోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. గణపతి బొప్పా మోరియా.. అంటూ భక్తులు నిమజ్జనాలను కోలాహలంగా నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని ఉత్సవ కమిటీలు గంగమ్మ ఒడిలో నిమజ్జనాన్ని అంతే ఘనంగా చేపట్టారు. గణనాథునికి ఉద్వాసన పలికిన అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన దుస్తులు ధరించిన యువకులు సంగీతానికి అనుగుణంగా నత్యాలు చేస్తూ..రంగులు చల్లుకుంటూ..భారీగా బాణాసంచా కాలుస్తూ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. సోమేశ్వరం, లొల్ల తదితర గ్రామాల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించి ఆయా గ్రామాల్లో కాలువల్లో వినాయకుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు.

స్వామివారి సన్నిధిలో భరత్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం సీఎంవో అడిషనల్ సెక్రటరీ (సీఎంవోఏసీ) ఎన్.భరత్ గుప్తా కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పూర్ణకుంభంతో ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు. ఆర్డీవో ఎన్.వసంతరాయుడు, సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సురక్ష

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గొల్లపుంత కాలనీ, ద్వారపూడిలలో వైద్య శిబిరాలు
- వైద్య నిపుణులచే రోగులకు సేవలు


వి.సావరంలో వైద్య పరీక్షల అనంతరం మందులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మండపేట: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక గొల్లపుంత కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్, ద్వారపూడిలోని స్త్రీశక్తి భవనం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను శనివారం ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఆయా చోట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, వైద్య శిబిరాల్లో వారికి వైద్య నిపుణులతో సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేస్తారన్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపి మెరుగైన వైద్యం అందిస్తారన్నారు. గత టీడీపీ పాలనకు బేరీజు వేసుకోవాలని, రాష్ట్రాభివృద్ధికి మరలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్సీ తోట ప్రజలకు వివరించారు.

గైనిక్, ఎముకలు, కళ్లు, జనరల్ తదితర విభాగాల వైద్య నిపుణులు హాజరై ఇంటింటి సర్వేలో గుర్తించిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రోగులను సంబంధిత వైద్య నిపుణుల వద్దకు పంపేందుకు శిబిరాల వద్ద ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం గూర్చి వివరిస్తూ అంగనవాడీ సిబ్బంది ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది అక్కడికక్కడే రోగి వివరాలను ఆన్‌లైన్ చేసి కేస్‌షీట్లను అందజేశారు. ద్వారపూడిలో గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మండపేట మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, ద్వారపూడిలో ఎంపీడీఓ ఐ. రాజు శిబిరాల నిర్వహణ సక్రమంగా జరిగేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, ఉప సర్పంచ్ తులా శేషారావు, వైఎస్సార్ సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్ బాబా, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మండపేట వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళలు


మండపేట వైద్య శిబిరానికి హాజరైన మహిళలు

రాయవరం మండలం వి.సావరంలో..

రాయవరం: జగనన్న ఆరోగ్య సురక్ష తో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వి.సావరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మేడిశెట్టి నాగమణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిరికి కృష్ణారావు ప్రారంభించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకర్, వ్యవసాయ శాఖ జేడీ బోసుబాబు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి తదితరులు మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 548 మందికి జనరల్ సర్జన్ బి.సౌమ్య, ఆర్థోఫిజీషియన్ వంశీకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవీ రాజేశ్వరి, చంద్రకుమారి వైద్యసేవలు అందించారు. 126 మంది ఐ స్క్రీనింగ్ చేయగా, 422 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వారిలో ఇరువురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వైద్య శిబిరంలో వైఎస్సార్ సీపీ నేతలు గుత్తుల సత్యనారాయణ, కాకి కోటేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరెడ్డి, మండ హరనాథరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతను పాటించేలా అవగాహన కల్పించాలి


గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పట్టణ సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రతి వార్డులో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కలిప్ంచాలని మున్సిపల్ అధికారులను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. పురపాలక పరిధిలో 18,19 వార్డుల్లో శనివారం ఉదయం మంత్రి వేణు గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డుల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో వేసిన చెత్తను వెంటనే తీసివేసి పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో నెలకుని ఉన్న సీసీ రోడ్లు, డ్రైన్ల సమస్యలను దాదాపుగా పరిష్కరించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న వాటిని నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి పట్టణంలో పరిపూర్ణంగా మురుగు సమస్య లేకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్‌లు కేతా శ్రీను, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు దార్ల శ్రీను, కోటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గొల్లపుంత కాలనీలో గడప గడపకూ..


20వ వార్డు వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో పేదల చెంతకే ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి అందుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆయన శనివారం స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ నేతలతో కలిసి తోట ఆ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అంటూ స్థానికుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్‌కు ఆదేశాలిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హత ఉండి కాళ్లరిగేలా అధికారులు, నాయకులు చుట్టూ తిరిగినా పథకాల లబ్ధి అందే పరిస్థితి ఉండేదని కాదన్నారు. ఇప్పుడు ఎక్కడకు తిరగాల్సిన పని లేకుండా వలంటీర్లు ఇంటికే వచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు షేక్ మస్తాన్, పలివెల సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు పాల్గొన్నారు.

పట్టణ ప్రధాన సమస్యకు పరిష్కారం

- డంపింగ్ యార్డు స్థలసేకరణపై కౌన్సిల్ హర్షం
- ఎమ్మెల్సీ తోటకు ఘన సన్మానం


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు, కౌన్సిలర్లు

మండపేట: డంపింగ్ యార్డుకు స్థల సేకరణ పూర్తి చేసి, పట్టణ ప్రధాన సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరిష్కరించారని కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. పట్టణ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనను ఘనంగా సత్కరించింది. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన శనివారం స్థానిక కౌన్సిల్ హాల్లో జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పేర్కొన్న అంశాలను కౌన్సిల్ ఆమోదించింది.

మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 1.8 ఎకరాల డంపింగ్ యార్డు సరిపోక చెత్త తరలింపు కష్టమవుతోందన్నారు. సమస్య తీవ్రతను ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకువెళ్లగా స్థల యజమానులతో మాట్లాడి వారితో కేసులు విత్ డ్రా చేయించడంతో పాటు ఎన్నోమార్లు ఆయన స్వయంగా సెక్రటేరియట్‌కు తిరిగి క్లియరెన్స్ తీసుకువచ్చారని వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ స్థలసేకరణపై గత పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. స్థల సేకరణకు సహకరించిన స్థల యజమానులు జొన్నల భాస్కరరావు, వెంకటేశ్వరావులకు ఎమ్మెల్సీ తోట కృతజ్ఞతలు తెలిపారు.

మెయిన్ రోడ్డుపై జాతీయ నేతల విగ్రహాలు

రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప రాష్ట్రపతి బాబూ జగ్జీవనరామ్ విగ్రహాలను మండపేటలో మారుమూల పేటకు పరిమితం చేయడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ తోట అన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని అందరిలో నింపేలా మెయిన్ రోడ్డులో వారి విగ్రహాలను పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా తీర్మానం చేయడంతో పాటు అనువైన స్థలాన్ని నిర్ణయించాలని కౌన్సిల్‌కు సూచించారు.

టీడీపీ వాకౌట్‌పై మండిపాటు

మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్న ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ కౌన్సిలర్లు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోవడం విమర్శలకు తావిచ్చింది. ఈ విషయమై కోఆప్షన్ సభ్యుడు రాజుబాబు మాట్లాడుతూ చైర్‌పర్సన్ ఇంకా అధ్యక్ష స్థానంలోకి రాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు చేసి సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నామని వెళ్లిపోవడం కౌన్సిల్‌ను అగౌరవ పరచడమేనని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై టీడీపీ సభ్యులు సమావేశంలో చర్చకు తీసుకురాకుండా వాకౌట్ చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ తోటను చైర్‌పర్సన్ దుర్గారాణి, కౌన్సిలర్లు, అధికారులు ఘనంగా సత్కరించారు, అలాగే స్థలసేకరణకు కృషిచేసిన చైర్‌పర్సన్ దుర్గారాణి, కమిషనర్ రామ్‌కుమార్‌లను సత్కరించారు. వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా మార్కెట్ కమిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ద్రాక్షారామ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారం వెంకటాయపాలెం పేపకాయల బాబ్జీ కల్యాణ మండపంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు ద్రాక్షారామ యానం సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తీన్‌మార్ డ్యాన్సులతో అభిమానులు వెంట రాగా వేదిక చేరుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ చైర్మన్ పేరూరి సోమరాజు, సభ్యులు గాడా లావణ్య, సూరంపూడి కృష్ణ, జుత్తుక రామలక్ష్మి, సుందరపల్లి వెంకటేశ్వరావు, రూకాత్ ఫాతిమా, జంగుం వీవీసత్యసూర్యప్రకాశరావు, మల్లిడి వెంకటరమణ, కేశనకుర్తి దేవి, సిద్దాని పద్మావతి, ములకల సుజాత, యాళ్ల విజయదుర్గ, విత్తనాల గంగరాజు, కొప్పార్ల వెంకట నరసింహరాజు, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పాణింగపల్లి సొసైటీ చైర్మన్ వైట్ల అచ్యుతరామప్రసాద్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నియోజకవర్గవ్యాప్తంగా పాల్గొన్న దళిత నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, ఎంపీపీలు అంబటి భవాని, మాతా భారతి, నియోజకవర్గ వ్యాప్తంగా దళిత సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆందోళన


గొల్లపాలెం పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న దేగల ఉమా రత్నవాణి

కాజులూరు: స్థలం సరిహద్దు వివాదంలో తనపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా తనపై తప్పుడు కేసులు బనాయించి మానసికంగా ఇబ్బందులు పాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలంటూ ఒక మహిళ శనివారం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బందనపూడికి చెందిన దేగల ఉమారత్నవాణి కోలంకలో 2022 జూలైలో 0.620 ఎకరాల భూమి కొనుగోలు చేసుకున్నారు. గ్రామానికి చెందిన తొగరు శేఖర్, శ్రీరామచంద్రమోహన్‌లు ఆ స్థలం మీదుగా తమకు రహదారి మార్గాలు ఉన్నాయంటూ ఉమారత్నవాణిపై దౌర్జన్యానికి దిగి మొక్కలు, ఇతర వస్తువులు ధ్వంసం చేశారు. గాయాల పాలైన ఉమారత్నవాణి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని వచ్చి గొల్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే నిందితులు రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్టుగా రిపోర్టు తీసుకువచ్చి రత్నవాణిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు తన ఫిర్యాదులు పట్టించుకోకుండా తొగరు శేఖరు, శ్రీరామచంద్రమోహన్‌లు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తనపై కేసు నమోదు చేశారని రత్నవాణి వాపోతున్నారు. నిందితుల నుంచి దాడులకు గురికావడమే కాకుండా పోలీసు కేసుల నెపంతో తనను తరచూ స్టేషన్ చుట్టూ తిప్పుతూ తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై గొల్లపాలెం స్టేషన్ ఎస్సై తులసీరామ్‌ను వివరణ అడగ్గా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా విచారణ నిర్వహించి రెండు వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులపైన కేసులు నమోదు చేస్తామన్నారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం


ద్రాక్షారామలో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ద్రాక్షారామ గున్రాల పరం జ్యోతి స్మారక గ్రంథాలయం భవనంలో 150 వ సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సభలో ముందుగా మహాత్మా జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ, సంఘ్ పరివార్‌ల నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలను కులాల వారీగా విభజించే, బ్రాహ్మణిస్టు సిద్ధాంతాన్ని సుస్థిరం చేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. అరుణోదయ జిల్లా కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం మాట్లాడతూ పేదరికాన్ని పెంచి పోషించే ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, వి.రామకృష్ణ, ఎం .దుర్గారావు, పట్టాభి, కె.లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ వైద్యం అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వేణుగోపాలకృష్ణ


ద్రాక్షారామలో అంగన్‌వాడీల పోషకాహార స్టాల్‌ను సందర్శించిన మంత్రి వేణు


కాజులూరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామచంద్రపురం: జబ్బు ఉన్న వాళ్లని జల్లెడ పట్టి వైద్య సేవలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచారపౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ పురపాలక సంఘం పరిధిలోని నాలుగో వార్డులో పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే వార్డులు, గ్రామాల వారీగా వ్యాధిగ్రస్తుల డేటాను గుర్తించారని వీరికి మెరుగైన వైద్య సేవలు అందే విధంగా జగనన్న సురక్ష శిబిరాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు వాడ్రేవు సాయిప్రసాద్, తోట అమ్మాజీ తదితర కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, డాక్టర్లు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తెచ్చి రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అవసరమైన వైద్య సేవలను కూడా గ్రామస్థాయికి తీసుకుని వచ్చేలా ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించడంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేరుతో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ఎవరు ఏ ఆరోగ్య సమస్యలు ఉన్నా వారికి అండగా జగనన్న ఉన్నాడన్న ధీమా, ఆరోగ్య పరిరక్షణ ఉండేలా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు సూపర్ సక్సెస్ అయ్యాయి. రామచంద్రపురం పట్టణంలో 469 మంది, ద్రాక్షారామలో 326 మంది వైద్య సేవలు పొంది సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేరీండి వెంకటేశ్వరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు నున్న సత్యవతి, తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, బళ్ల సుధాకరరావు, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణ, వీరబోయిన సూరిబాబు, నక్కిన దొరబాబు, పిల్లి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. శనివారం కాజులూరులో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు వై.సుప్రియ, జి.స్వాతిల ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 400 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీఓ, మండల తహసీల్దార్ల ఆధ్వర్యంలో మండల అధికారులు రెండు టీములుగా విభజింపబడి శనివారం నుంచి అక్టోబరు 27 వ తేదీ శుక్రవారం వరకూ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజని, ఉప సర్పంచ్ చిన్నారావు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, మండల తహసీల్దారు బి.సాయిసత్యనారాయణ, యాళ్ల సత్తిబాబు, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు చక్రవర్తుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న సత్యనారాయణరెడ్డి


క్రీడా ప్రదర్శనలో విద్యార్థులు

జిల్లా డీవీఈఓ సత్యనారాయణరెడ్డి

మండపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా డీవీఈఓ సత్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. మండపేటలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ తీరును శనివారం ఆయన పరిశీలించారు.గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అండర్ -19 విభాగం రాష్ట్ర బృందం ఎంపిక పోటీలు హోరా హోరీగా సాగాయి. క్రీడాకారులతో సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకర పోటీతత్వంతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. అనంతరం కళాశాల తరగతుల్లో బోధనా తీరును పరిశీలించి అధ్యాపక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి, అధ్యాపక సిబ్బంది ఉన్నారు. కాగా బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్, టెన్నికాయిట్, చెస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.